సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



తునికాకు సేకరణకు వేళాయె..
ఈ నెల 21న తునికాకు ధరపై ఒప్పందం కుదరగా, వారం రోజుల్లో గిరిజనులు ఆకు సేకరణ ప్రారంభించనున్నారు. 8లో



రాష్ట్రంలో 15 సీట్లు గెలుస్తాం..
ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 నుంచి 15 సీట్లు గెలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 42° / 25°
జిల్లాలో ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొవచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు


పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య నాయకులతో సమావేశమై జిల్లాలో కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోత్ హరిప్రియ, గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, రాష్ట్ర నాయకులు మోరె భాస్కర్, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన పొగాకు ధర

- రూ. 22 పెరిగి రూ.341కు చేరిన కిలో ధర


అశ్వారావుపేటలో సాగు చేస్తున్న పొగాకు

అశ్వారావుపేటరూరల్: వర్జీనియా పొగాకు ధర దూసుకుపోతోంది. శనివారం కిలో ధర రూ.341కు చేరుకుంది. జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో సాగులో ఉండగా, పొగాకు బేళ్లను ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఉన్న టుబాకో బోర్డు వేలం కేంద్రం–2లో విక్రయిస్తున్నారు. గతేడాది కొనుగోళ్ల ముగింపు నాటికి అత్యధికంగా కిలోకు రూ.288 లభించగా, గురువారం వరకు ధర నామమాత్రంగా ఉంది. శుక్రవారం నిర్వహించిన వేలంలో ఏకంగా కిలో ధర రూ.319 పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించింది. శనివారం ధర మరింత పెరిగి రూ.341 లభించింది. ఒక్క రోజు వ్యవధిలోనే కిలోకు రూ.22 చొప్పున ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొగాకు బేళ్లను విక్రయించేందుకు జంగారెడ్డిగూడెం తరలిస్తున్నారు. అంతర్జాతీయంగా పొగాకు కొరత, మిచాంగ్ తుపాను కారణంగానే కిలో ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తుండగా, కిలో ధర మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు సాగుదారులు చెబుతున్నారు.

కానిస్టేబుల్ నాగముత్యంకు డీజీపీ సత్కారం


కానిస్టేబుల్ నాగముత్యంకు ప్రశంసా పత్రం ఇస్తున్న డీజీపీ రవిగుప్తా

దమ్మపేట: దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగముత్యంను శనివారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తా శాలువాతో సత్కరించి, అభినందించారు. ప్రశంసా పత్రం అందజేశారు. ఇటీవల ములుగు జిల్లా మేడారంలో జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరలో ముగ్గురు భక్తులకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న నాగముత్యం వారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి కాపాడాడు. దీంతో పోలీస్ శాఖ అతని సేవలను గుర్తించి, హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో సన్మానించింది. అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టేది..?

ఎన్నికల ప్రచారంలో ప్రస్తావనకు నోచుకోని ప్రజా సమస్యలు

- భవిష్యత్ అభివృద్ధిపై కనిపించని హామీలు
- గెలుపే లక్ష్యం.. పార్టీ శ్రేణులతో సమాలోచనలతోనే సరి


కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించని భద్రాచలం రామాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల హడావుడి మొదలైతే చాలు రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థులు హామీలు గుప్పిస్తారు. ఎన్నాళ్ల నుంచో ఉంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, నియోజకవర్గ ఓటర్ల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామని ప్రకటిస్తారు. కానీ ఈసారి ఎన్నికల్లో ఈ తరహా వాతావరణం పెద్దగా కనిపించడం లేదు. అభ్యర్థులు తమను గెలిపించండనే విజ్ఞప్తికి పరిమితమవుతుండగా, రాజకీయ పార్టీలు ప్రత్యర్థి పార్టీలపై దుమ్మెత్తిపోయడంపైనే దృష్టి పెడుతున్నాయి.

సాదాసీదా ప్రచారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇందులో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఖమ్మం పరిధిలో ఉండగా ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాలు మహబూబాబాద్ పరిధిలో ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రధాన పార్టీలుగా ఉండగా కమ్యూనిస్టు పార్టీలు, స్వతంత్రులు పోటీకి సై అంటున్నారు. దాదాపుగా అన్ని ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ప్రచారాన్ని సైతం ఆరంభించాయి. కానీ ఏ రాజకీయ పార్టీ కూడా జిల్లాలోని సమస్యల పరిష్కారం, భవిష్యత్ గ్యారెంటీలకు హామీలు ఇవ్వడంలేదు.

గెలుపుపైనే..

ఖమ్మం పార్లమెంటు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావు ఒక్కరే భద్రాచలం సర్క్యూట్‌తోపాటు మరికొన్ని అభివృద్ధి ప్రణాళికలను తన ఎన్నికల ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. మహబూబాబాద్ నుంచి కమలం గుర్తుపై పోటీ చేస్తున్న అజ్మీర సీతారాంనాయక్ చుట్టపుచూపు ప్రచారానికే పరిమితమవుతున్నారు తప్పితే గెలిపిస్తే ఏం చేస్తామనే అంశంపై ఫోకస్ చేయడం లేదు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా ఉన్న మాలోతు కవిత, నామా నాగేశ్వరరావులు మరోసారి అవకాశం ఇవ్వండని కోరుతున్నారు, తప్పితే గడిచిన ఐదేళ్లలో తాము, ఏం సాధించాం, రాబోయే ఐదేళ్లలో ఏం చేస్తామో చెప్పడంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

విమర్శలకే పరిమితం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ఇప్పటికే మణుగూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అభ్యర్థి బలరాంనాయక్ మొదలు సీఎం రేవంత్‌రెడ్డి వరకు ప్రచారంలో అంతా బీఆర్‌ఎస్, బీజేపీలపై విమర్శలు చేయడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ నుంచి ఎన్నికల సమయంలో కనీస హామీలు రాకపోవడమనేది ఆ పార్టీ ప్రచారంలో ఒక లోటేనని జిల్లా వాసులు భావిస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర షెడ్యూల్ ఖరారైంది. దీంతో ఎన్నికల వేడి మరింతగా రాజుకునే అవకాశం ఉంది. కనీసం కేసీఆర్ నుంచైనా హామీలు వస్తాయనే ఆశలు ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో విమర్శలతో పాటు స్థానిక సమస్యల సాధనకు పార్టీలు, వాటి అధినేతలు చోటిస్తే బాగుంటుంది.

ప్రధాన సమస్యలు

- ❑ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు
- ❑ భద్రాచలంలో విలీన మండలాలు/గ్రామాల్లో కొన్నింటిని తిరిగి తెలంగాణలో కలపడం
- ❑ గోదావరి వరద ముంపు సమస్యకు పరిష్కారం
- ❑ భద్రాచలం ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ❑ సింగరేణి విస్తరణలో జాప్యం, ఇల్లెందు, కొత్తగూడెం పట్టణాల భవిష్యత్‌కు గ్యారెంటీ
- ❑ ఆయిల్‌పామ్ రంగానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టం, ఉద్యాన పంటలకు కేంద్రం నుంచి ప్రోత్సాహకాలు అందివ్వడం
- ❑ నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే ప్రకటించిన రహదారులకు నిధుల మంజూరు
- ❑ కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీకి టెక్నికల్ యూనివర్సిటీ హోదా
- ❑ భద్రాద్రి జిల్లాలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ, సైనిక్ స్కూళ్ల ఏర్పాటు
- ❑ దేశంలోని వివిధ నగరాలు/ పట్టణాలను కలుపుతూ అధునాతన నమోభారత్ రైలు, బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ బల్లార్షా – మణుగూరుల మధ్య రాత్రి సమయంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఏర్పాటు, నిర్మాణంలో ఉన్న కొత్త /డబ్లింగ్ పనుల్లో వేగం పెంచడం
- ❑ పుణ్యక్షేత్రాలైన బాసర, షిరిడీ, తిరుపతి ప్రాంతాలకు జిల్లా నుంచి రైలు సౌకర్యం కల్పించడం.

సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు సంజయ్, పక్కన కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్

- వ్యయ పర్యవేక్షణపై దృష్టి పెట్టాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు నిర్వర్తించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం పోలీస్ పరిశీలకులు చరణ్‌జీత్ సింగ్, వ్యయ పరిశీలకులు శంకర్ ఆనంద్‌మిశ్రా, రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్, జిల్లాఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజ్‌లతో కలిసి సహాయ రిటర్నింగ్ అధి కారులు, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్, ప్రచారం, వ్యయ పర్యవేక్షణ బృందాలు క్రియాశీలకంగా ఉండాలన్నారు. పోలింగ్‌కు 72 గంటల ముందు ఎంసీసీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వీప్ కార్యాచరణ విస్తృత పర్చాలని వివరించారు. పోలీస్ పరిశీలకుడు చరణ్‌జీత్‌సింగ్ మాట్లాడుతూ వ్యయ పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, నోడల్ ఆఫీసర్లు, ఎన్నికల సూపరింటెండెంట్లు దారా ప్రసాద్, రంగా ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

అశ్వారావుపేట: సాధారణ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ శనివారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూం, కమిషనింగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ ఏరియాను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, సామగ్రి పంపిణీపై సూచనలు చేశారు. ఏపీ సరిహద్దు దమ్మపేట మండలం మందలపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీఐ జితేందర్‌రెడ్డి ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

బీజేపీ జాతీయ నేత సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

చుంచుపల్లి: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 29న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు సభకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, ఖమ్మం ప్రభారి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జీవీకే మనోహర్, ఎడ్లపల్లి శ్రీనివాస్, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, నియోజకవర్గాల కన్వీనర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక హోరెత్తాల్సిందే..

- జోరు పెంచిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు
- సమావేశాలు, రోడ్డు షోలతో సందడి
- రేపటి నుంచి ఉమ్మడి జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో
- కొత్తగూడెంలో ప్రచారానికి రానున్న జేపీ.నడ్డా
- అగ్రనేతలతో ప్రచారానికి కాంగ్రెస్, బీజేపీ ప్రణాళిక



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీలు గేర్ మార్చాయి. ఈనెల 25వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. బరిలో ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు సుడిగాలి ప్రచారం చేస్తుండగా.. ముఖ్యనేతలు సైతం రోడ్‌షోలు, సభలు, సమావేశాల ద్వారా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమ, మంగళవారాల్లో బస్సుయాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రోడ్డు షోల ద్వారా ఆయన ప్రసంగిస్తారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా సోమవారం కొత్తగూడెంలో జరిగే ప్రచారానికి హాజరుకానున్నారు. అంతేకాక మరికొందరు అగ్రనేతలతో ప్రచారానికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

అలస్యమైనా.. దూకుడు

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంలో అలస్యం జరగగా తొలినాళ్లలో ప్రచారంపై అంతగా దృష్టి పెట్టలేదు. ఈనెల 24వ తేదీ రాత్రి కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని అధిష్టానం ప్రకటించడంతో గురువారం నామినేషన్ దాఖలు చేయగానే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నామినేషన్ వేసిన రోజు రాత్రే ఖమ్మంలో పలుచోట్ల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. శుక్రవారం కూసుమంచి, అశ్వారావుపేటలో, శనివారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి మరో 14 రోజుల సమయమే ఉండటంతో పార్టీ అగ్రనేతల పర్యటన కూడా ఉంటుందని నాయకులు చెబుతున్నారు.

స్పీడ్ పెంచిన బీఆర్‌ఎస్

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ దూసుకెళ్తోంది. ఆ పార్టీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావును ముందుగానే ప్రకటించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం సాగించారు. నామినేషన్ దాఖలుకు ముందే కార్యకర్తలను కలుస్తూ వారికి దిశానిర్దేశం చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో పాటు ప్రచారంలో పాల్గొంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించడమే కాక.. ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలాల ముఖ్యనేతలతో పువ్వాడ సమావేశమయ్యారు. అలాగే, ఈనెల 29, 30వ తేదీల్లో జరిగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్‌యాత్ర, రోడ్‌షో విజయవంతానికి సన్నాహాలు చేస్తున్నారు. గులాబీ దళపతి ప్రచారంతో అభ్యర్థికి అనుకూల పవనాలు వీస్తాయని నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

చుట్టేస్తున్న బీజేపీ అభ్యర్థి

బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్నారు. ఖమ్మం నుంచి ఎలాగైనా ఈసారి సత్తా చాటాలనే ఉద్దేశంతో ఆ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా ముందుగానే అభ్యర్థిని ప్రకటించారు. దీంతో వినోద్‌రావుకు సరిపడా సమయం ఉండడంతో ఇప్పటికే ఒక దఫా ప్రచారం పూర్తిచేశారు. అభ్యర్థితోపాటు తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఇతర నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే రోడ్డు షోలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ మరోమారు కేంద్రంలోకి అధికారంలోకి వస్తుందని, ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పాటుపడతానంటూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మా ఓట్లను తెచ్చిపెడుతుందనే నమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నారు.

మిగతా వారు అంతంతే..

ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ల స్క్రూటినీ అనంతరం 41 మంది అభ్యర్థులు బరిలో మిగిలారని అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మిగిలిన అభ్యర్థుల మాత్రం ఇంకా రంగంలోకి దిగలేదు. కొన్నిచోట్ల మాత్రమే వీరు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, సోషలిస్ట్ పార్టీ, బహుజన లెఫ్ట్ పార్టీ, ఆధార్‌పార్టీ, యువతరం, జై భారత్ నేషనల్ పార్టీతో పాటు మరికొన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరు కూడా ప్రచారాన్ని ప్రారంభిస్తే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

అంతకు ముందు.. ఆ తర్వాత

- తెలంగాణ ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ వర్సెస్ కమ్యూనిస్టులు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- భద్రాచలం–మహబూబాబాద్ సెగ్మెంట్‌లో మారిన రాజకీయ స్వరూపం

భద్రాచలం: పూర్వ భద్రాచలం, నూతన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రాజకీయ ముఖచిత్రం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తర్వాత అన్న చందంగా మారింది. పునర్విభజనకు ముందు ఉన్న భద్రాచలం పార్లమెంటరీ నియోయజకవర్గంలో కాంగ్రెస్ కొన్నిసార్లు, మరికొన్ని సార్లు కమ్యూనిస్టులైన సీపీఐ, సీపీఎంలు విజయం సాధించాయి. పునర్విభజన అనంతరం ఏర్పడిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రాజకీయం తారుమారైంది. కమ్యూనిస్టులు కనుచూపు మేరలో లేకపోగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ పాగా వేసింది. అప్పటి నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నడుమే తీవ్ర పోటీ నెలకొంటోంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా, ఇప్పటికే నామినేషన్ల ఘట్టం, స్క్రూటినీ పూర్తయింది. కాంగ్రెస్ తరఫున పోరిక బలరాం నాయక్, బీఆర్‌ఎస్ తరుపున మాలోత్ కవిత, బీజేపీ తరఫున అజ్మీరా సీతారాం నాయక్‌లు బరిలో నిలిచారు. బలరాం నాయక్ మూడోసారి, కవిత రెండో సారి, అజ్మీరా సీతారాం నాయక్ రెండో సారి పోటీలో నిలిచారు.


రాధాభాయి ఆనందరావు


సోడె రామయ్య


కర్రెద్దుల కమలకుమారి


దుంపా మేరి విజయకుమారి

కాంగ్రెస్ కోటలో కమ్యూనిస్టుల పాగా


మిడియం బాబూరావు

భద్రాచలం పార్లమెంటు స్థానం 1967లో ఏర్పడింది. ఆవిర్భావం నుంచి వరుసగా నాలుగుసార్లు కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. 1967, 1971, 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బి.రాధాబాయి ఆనందరావు వరుసగా నాలుగుసార్లు గెలిచారు. ఆ తర్వాత 1984 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి సోడె రామయ్య గెలుపొందారు. అనంతరం 1989, 1991 ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ తరఫున కర్రెద్దుల కమల కుమారి గెలిచారు. మళ్లీ 1996,1998 ఎన్నికలలో సీపీఐ తరఫున సోడె రామయ్య రెండుసార్లు, 1999లో టీడీపీ అభ్యర్థి దుంపా మేరి విజయకుమారి, 2004లో సీపీఎం అభ్యర్థి మిడియం బాబూరావు గెలుపొందారు. పూర్వ భద్రాచలం నియోజకవర్గంలో 11 సార్లు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ ఆరు సార్లు, సీపీఐ మూడు సార్లు, సీపీఎం, టీడీపీ ఒక్కోసారి గెలిచాయి. ఇలా ప్రధానంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య పోరు కొనసాగింది.

తెలంగాణ ఏర్పాటుతో తారుమారు


పోరిక బలరాంనాయక్


అజ్మీరా సీతారాం నాయక్


మాలోత్ కవిత

నియోజకవర్గాల పునర్విభజనలో భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గం రద్దయి మహబూబాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. దీనికితోడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన బీఆర్‌ఎస్ పార్టీ రాకతో.. రాజకీయం తారుమారయింది. 2009 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపొందారు. ఇక రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014, 2019 ఎన్నికల్లో రెండు సార్లు కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. తొలిసారి అజ్మీరా సీతారాం నాయక్ గెలవగా, మలిసారి మాలోత్ కవిత విజయం సాధించారు. ఇలా రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా రాజకీయం మారింది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పునర్విభజనకు ముందు నువ్వా నేనా అనే రీతిలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ప్రస్తుతం కనీసం పోటీలో నిలబడే పరిస్థితిలో లేవని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

'డిపెండెంట్ల'ను వేధించొద్దు

- అంకితభావంతో విధులు నిర్వర్తించాలి
- సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్


జీఎం బసవయ్యను సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): అనారోగ్య కారణాలతో డిపెండెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టుకున్న కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధిస్తే సహించేది లేదని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో సంస్థలోని 11 ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిలిచిపోయిన బయోమెట్రిక్, ఎఫ్ఆర్‌సీ విధానాలను తిరిగి అమల్లోకి తెస్తామన్నారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, సకాలంలో విధులకు రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నియామకాలు, కారుణ్య నియామకాలు, సీఎంపీఎఫ్ క్లెయిమ్స్ త్వరితగతిన సెటిల్ చేయాలన్నారు. అనంతరం ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు బి.హనుమంతరావు, కవితానాయుడు, సామ్యేల్ సుధాకర్, బెనెడిక్ట్ నికోలస్, కోదురు శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లో ఉద్యోగులు సత్తా చాటాలి



మాట్లాడుతున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: క్రీడల్లో విద్యుత్ ఉద్యోగులు సత్తా చాటాలని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్‌లో టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు కేటీపీఎస్ 5, 6, 7 దశలు, జూరాల, బీటీపీఎస్, వైటీపీఎస్, శ్రీశైలం, నాగర్జునసాగర్, పులిచింతల, విద్యుత్ సౌధ టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సీఈ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. క్రీడల్లో స్నేహపూర్వకంగా మెలగాలని, క్రీడాస్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో లోహిత్ ఆనంద్, వీరస్వామి, వెంకటేశ్వర్లు, మోక్షవీర్, రామారావు, వైటీఎం కె.రాజు, కట్టా శ్రీధర్, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు రగడపై సమావేశం

భద్రాచలంఅర్బన్: గడిచిన కొద్దిరోజులుగా భద్రాచలం గ్రామపంచాయతీ ఆధ్వర్యాన టెండర్ ద్వారా నిర్వహిస్తున్న పార్కింగ్ ఆశీలు వసూళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు శనివారం సమావేశమయ్యారు. ఈ అంశంలో దేవస్థానం, గ్రామపంచాయతీ మధ్య వివాదం నెలకొనగా, పోలీసులు, దేవస్థానం, గ్రామపంచాయతీ అధికారులు దేవస్థానం ఈఓ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ మేరకు పార్కింగ్‌కు సంబంధించి నిర్దేశించిన ప్రదేశాల్లోనే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలని నిర్ణయించారు. దీంతో రామాలయం ఆవరణలో ఏర్పాటు చేయించిన ఫ్రీ పార్కింగ్ ఫ్లెక్సీలను తొలగించేందుకు దేవస్థానం ఈఓ రమాదేవి సుముఖత వ్యక్తం చేశారు. కాగా, గ్రామపంచాయతీ ఆధ్వర్యాన ఆశీలు పేరిట ఎక్కువ నగదు వసూలు చేస్తుండడంతో దేవస్థానం ఈఓ ఆధ్వర్యాన భక్తుల కోసం పలు ప్రదేశాల్లో ఫ్రీ పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేయగా, ఆశీలు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అభ్యంతరం తెలపడంతో వివాదం నెలకొనగా.. అధికారులతో చర్చలతో సమస్య పరిష్కారమైంది.

వివాహిత అదృశ్యం

మణుగూరుటౌన్: మండలంలోని బాంబేకాలనీలో వివాహిత కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సాంబశివరావు రోజూ లాగే ఈ నెల 25వ తేదీన డ్యూటీకి వెళ్లి ఇంటికి వచ్చి చూడగా భార్య అమూల్య (25) కనిపించలేదు. స్థానికుల వద్ద వాకబు చేయగా మధ్యాహ్నం 3 గంటలకు బయటకు వెళ్లినట్లు తెలిపారు. సాంబశివరావు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు: ఏపీలోని అనంతపురం పట్టణానికి చెందిన ఓ యువకుడు మనస్తాపంతో సారపాకలోని అమ్మమ్మ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనంతపురం పట్టణానికి చెందిన నౌషద్ పాషా (25) ఆరు నెలల కిందట అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాళ్లు విరిగిపోయి.. గాయాలు తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఉంటే మనోవేదన ఎక్కువవుతుందని భావించి కుటుంబసభ్యులు శుక్రవారం అతడిని సారపాకలోని అమ్మమ్మ ఇంటికి తీసుకొచ్చారు. 24 గంటలు గడవకముందే జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బీబీ ఫాతిమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని మహిళ..

గుండాల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. కాచనపల్లి పంచాయతీ జగ్గుతండాకు చెందిన తేజావత్ మౌనిక (23) భర్త సాగర్‌తో కలిసి ఆ గ్రామంలో జరిగిన ఓ వివాహానికి వెళ్లింది. మధ్యలోనే ఇంటికి వచ్చిన మౌనిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174


పెద్దమ్మతల్లి సన్నిధిలో మంత్రి పొంగులేటి, రాఘురాంరెడ్డి

దీవించు తల్లీ..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పాల్వంచలోని పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. వారికి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అర్చకులు అందించారు. -పాల్వంచరూరల్

కారు ఎమ్మెల్యేదైనా..

ఆళ్లపల్లి మండలంలోని ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని వెళ్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు దిగి పోలీసులకు సహకరించారు. ఎస్ఐ రతీశ్, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు. -గుండాల


ఎమ్మెల్యే కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

తునికాకు సేకరణకు వేళాయె..

- వారం రోజుల్లో ప్రారంభించనున్న గిరిజనులు
- 50 ఆకుల కట్టకు రూ.3.03 ధర ఖరారు
- మండుతున్న ఎండలతో ఆందోళన

ఇల్లెందు: తునికాకు ధర ఖరారైంది. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గుండాల మండలం వెన్నెలబైలు గ్రామంలో కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి ఓ అంగీకారానికి వచ్చారు. న్యూడెమోక్రసీలోని మూడు వర్గాలు, మాస్‌లైన్ ప్రజాపంథా, ఎంఎల్ ప్రతిఘటన, ఎంఎల్, సీపీఐ, సీపీఎం, తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాలు, పోరాట కమిటీ చర్చల్లో పాల్గొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తునికాకు సేకరణ జరుగుతున్నా కేవలం ఇల్లెందులో ప్రాంతంలోనే చర్చలు జరిపే రేటునిర్ణయించే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ నెల 21న రేటు ఒప్పందం జరగ్గా, వచ్చే నెల మొదటి వారంలో కోత ప్రారంభంకానుంది. మేడే జరుపుకుని సేకరణకు వెళ్లాలని కాంట్రాక్టర్లు కార్మికులతో సమాలోచనలు చేశారు. కాగా తునికాకు సేకరణను గిరిజనులు వేసవిలో రెండో అతిపెద్ద పంటగా భావిస్తూ, ఆదాయం పొందుతుంటారు.


ఆకు సేకరిస్తున్న గిరిజనులు (ఫైల్)

స్టాండర్డ్ బ్యాగుకు రూ.333.75 కమీషన్

ధర ఖరారైన నేపథ్యాన తునికాకు సేకరణకు కార్మికులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో 37 యూనిట్లలో 677 కల్లాలు ఏర్పాటు చేయనుండగా, 47,800 స్టాండర్డ్ బ్యాగ్‌ల ఆకు సేకరించాలని లక్ష్యంగా కార్మికులు నిర్దేశించుకున్నారు. గతేడాది 50 ఆకుల కట్ట ధర రూ.3.01 ఉండగా, ఈ ఏడాది రూ.3.03కు పెంచారు. స్టాండర్డ్ బ్యాగుకు మొత్తం కమీషన్ గతేడాది రూ.302.50 ఉండగా, ఈసారి 10 శాతం పెంచి రూ. 332.75 చెల్లించేలా నిర్ణయించారు. ఇందులో కల్లేదారు కమీషన్ రూ.157, పల్లా, కుచ్చాకు రూ.79.86, భర్తీకి రూ.95.83 చెల్లించనున్నారు. పెరిగిన ధర గుండాల, సాయనపల్లి, నీలాద్రిపేట, గంగారం, కంబాలపల్లి, కాచనపల్లి, సుదిమళ్ల, ధనియాలపాడు, కొమరారం, శెట్టిపల్లి, యానంబైల్, పాల్వంచ వైల్డ్‌లైఫ్ యూనిట్లలో అమలు చేయనున్నారు. దీంతో కార్మికులకు కొంత ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

డివిజన్	యూనిట్లు	కల్లాలు	సాధించే లక్ష్యం (స్టాండర్డ్ బ్యాగ్‌లు)
పాల్వంచ	7 యూనిట్లు	134	4,100
కొత్తగూడెం	5 యూనిట్లు	81	4,800
భద్రాచలం	5 యూనిట్లు	130	12,600
కిన్నెరసాని వైల్డ్‌లైఫ్	6 యూనిట్లు	53	5,000
ఇల్లెందు	10 యూనిట్లు	169	13,800
మణుగూరు	6 యూనిట్లు	110	7,500

నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలు

వారం రోజుల్లో తునికాకు సేకరణ ప్రారంభకానుంది. మరోవైపు గతం వారం రోజులుగా ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పోడు భూముల్లోనే ఏపుగా ఎదిగిన తునికాకు నెలా 15 రోజులపాటు సేకరించేవారు. దీంతో లాభసాటిగా ఆదాయంగా ఉండేది. అయితే పోడు భూముల్లో ట్రాక్టర్ల ద్వారా, యంత్రాల ద్వారా సాగు చేస్తుండటంతో తునికి చెట్లు వేర్లతో సహా పెకలించివేశారు. దీంతో పోడు భూముల్లో ఆకు లేకుండా పోయింది. ఇక అటవీ ప్రాంతాలకు వెళ్లక తప్పదు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జోలెలు, సంకకు బుర్రలతో వెళ్లి సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆకు సేకరించాలంటే గిరిజనులు జంకుతున్నారు.

గిరిజనులకు ఉపాధి..

పాల్వంచరూరల్: ఏజెన్సీలో వేసవికాలంలో తునికాకు సేకరణ గిరిజనులకు రెండు నెలలపాటు ఉపాధి కల్పిస్తుంది. తునికాకు చిగురు ఏపుగా వస్తుండటంతో మరో నాలుగైదురోజుల్లో కోత మొదలు కానున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లా మినహా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తునికాకు సేకరణను కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని అటవీశాఖ అధికారులతో ఒప్పందాలు పూర్తి చేసుకున్నారు. ఇటీవల మోడెం కొట్టించడంతో ఆకు చిగురిస్తోంది.


అటవీ ప్రాంతంలో ఏపుగా పెరిగిన ఆకు

రాష్ట్రంలో 15 సీట్లు గెలుస్తాం..

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ జరుగుతోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంరూరల్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 పార్లమెంట్లు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 14 నుంచి 15 సీట్లు గెలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని ప్రసంగించారు. తనపై ఉన్న అభిమానంతో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేనిని ఎమ్మెల్యేగా గెలిపించినట్లు ఎంపీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతుల రుణమాఫీ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయంలో నిర్మించిన కాళేశ్వరంపై, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుగుతోందని తెలిపారు. రాష్ట్రాలు, ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేలా బీజేపీ ప్రయత్నిస్తోందని, విభజన హామీ చట్టం ప్రకారం కొత్త రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించలేదని పేర్కొన్నారు. రూ.46 వేల కోట్లతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్యతోపాటు తోట దేవీప్రసన్న, నాగా సీతారాములు, కాసాని ఐలయ్య, సాబీర్‌పాషా, దుర్గరాశి వెంకన్న, ఎడవల్లి కృష్ణ, తూము చౌదరి, ఆళ్ల మురళి, నాగేంద్రత్రివేది, చీకటి కార్తీక్, కోనేరు సత్యనారాయణ, ఎండీ రజాక్, తుళ్లూరు బ్రహ్మయ్య, రామనాథం, రియాజ్ అహ్మద్, అంతోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలానికి కరకట్ట పనులు పూర్తికావాలి

కలెక్టర్‌తో ఫోన్‌లో మంత్రి తుమ్మల


భద్రాచలంలో కొనసాగుతున్న కరకట్ట పనులు

భద్రాచలం: భద్రాచలంలో సుభాష్‌నగర్ ప్రాంతంలో చేపట్టిన కరకట్ట పొడిగింపు పనులను ఎట్టి పరిస్థితుల్లోనైనా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆయన కరకట్ట పనుల గురించి ఫోన్‌లో కలెక్టర్ ప్రియాంక ఆలతో మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వరద నీటితో సుభాష్‌నగర్ పరిసర ప్రాంతకాలనీలు ముంపునకు గురవుతున్నాయని, రాత్రికి రాత్రే ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితి తలెత్తుతున్న నేపథ్యంలో ప్రారంభించిన ఈ పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

త్వరగా పూర్తి చేయాలని వినతి..

కరకట్ట పొడిగింపునకై ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసింది. ఎన్నికల నేపథ్యంలో నాటి మంత్రి అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. తరువాత ఎన్నికలు జరగటం.. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో పనుల్లో వేగం మందగించింది. దీంతో శనివారం కాలనీవాసులు మంత్రి తుమ్మలను కలిశారు. వర్షాకాలం వచ్చేలోపే పనులు పూర్తి చేయాలని వేడుకున్నారు. దీంతో మంత్రి తుమ్మల స్వయంగా కలెక్టర్‌తో ఈ సమస్యపై మాట్లాడారు.

నగదు, మద్యం సీజ్

దమ్మపేట: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, అనుమతి లేకుండా బెల్ట్ దుకాణంలో విక్రయిస్తున్న మద్యం సీసాలను పోలీసులు, ఎఫ్ఎస్‌టీం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. శనివారం అల్లిపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నుంచి తెలంగాణలోని ఇల్లెందు వైపునకు వెళ్తున్న వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. రూ.56 వేల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముష్టిబండ గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి, 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చీమ తెలిపారు.

రూ.66 వేల నగదు..

సుజాతనగర్: ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన వడ్డే చంద్రశేఖర్ కారులో రూ.66 వేల నగదుతో వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ నేతృత్వంలో సీజ్ చేసినట్లు ఎస్ఐ జుబేదాబేగం తెలిపారు.

ఉద్యాన పంటల సస్యరక్షణపై అవగాహన


రైతులకు సూచనలిస్తున్న డీహెచ్ఎస్ఓ సూర్యనారాయణ

దమ్మపేట: ఉద్యాన పంటలైన పామాయిల్, జీడి మామిడి, మామిడి, కొబ్బరి, కూరగాయాల సాగులో సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిందు సేద్యం పద్ధతులపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి కె.సూర్యనారాయణ రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని గున్నేపల్లి గ్రామంలో పామాయిల్, కొబ్బరి, మామి డి, జీడి మామిడి తోటలను ఆయన సందర్శించారు. ప్రస్తు తం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైన ఉన్నందున పామాయిల్ మొక్కకు ఇరువైపులా డ్రిప్ ద్వారా నీటిని అందించాలని సూచించారు. పామాయిల్ చెట్ల మధ్యలో జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేసి, పెరిగిన తరువాత వాటిని భూమిలో కలిసేలా దున్నాలని చెప్పారు. పామాయిల్‌లో కొమ్ము పురుగు నివారణకు లామ్డాసైహాలోత్రిన్ మందును ఒక లీటరు నీటిలో 2 ఎంఎల్ చొప్పున కలిపి మొవ్వ ఆకులో పోయాలని, ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ వ్యర్థాలైన పీచు, డీమక్, ఫైబర్‌లను ఎరువుగా మల్చింగ్ పద్ధతిలో వాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో మొద్దులగూడెం, గున్నేపల్లి, గణేశ్‌పాడు, నాయుడు పేట రైతులు, ఉద్యాన అధికారి సందీప్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జూలూరుపాడు: జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్‌రోడ్ వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శనివారం మద్యం పట్టుకున్నారు. పడమటనర్సాపురానికి చెందిన బెల్టు దుకాణం నిర్వాహకుడు రామయ్య బైక్‌పై 17 బీర్లు, 20 క్వార్టర్ బాటిల్లు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేశామని, మద్యం విలువ రూ.6,722 ఉంటుందని, ఆయనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జీవన్‌రాజు తెలిపారు.

రూ.1.2లక్షల నగదు..


నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం–నారాయణపురం గ్రామాల మధ్య నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నారాయణపురం గ్రామానికి చెందిన బోయినపల్లి మధు వద్ద ఉన్న రూ.60 వేల నగదును, రింగ్‌రోడ్ సెంటర్లో చేపట్టిన తనిఖీల్లో ఏపీలోని ఏలూరు జిల్లా లింగపాలేనికి చెందిన చికగాలు దినేశ్ వద్ద ఉన్న రూ.60 వేల నగదును పట్టుకున్నారు. ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేశామని ఎస్ఐ శివరామకృష్ణ, ఎన్నికల స్క్వాడ్ కృష్ణ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు చేయండి


రికార్డులు పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

ఇల్లెందు: ఎన్నికల నామినేషన్లు ముగిసి ప్రచారం ఊపందుకుంటున్న తరుణంలో సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని మహబూబాబాద్ ఎంపీ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాంకుమార్‌గోపాల్ ఆదేశించారు. శనివారం లలితాపురం, నెహ్రూనగర్ చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎన్నికల ప్రత్యేక అధికారులు సీహెచ్ కోటయ్య, పృథ్వీరాజ్, రవికుమార్ ఉన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి సమీపంలో కారుకొండ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్‌గోపాల్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ టి.సురేశ్, ఎస్ఐ షేక్ సైదారవూఫ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలియాస్ అంతేనా..?

ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు


సింగరేణి కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పేరు మార్పిడి సమస్య కార్మికులను వేధిస్తోంది. 35 – 40 ఏళ్ల క్రితం పలువురు దళారులు నాటి అధికారులను మచ్చిక చేసుకుని కొందరి నుంచి ముడుపులు స్వీకరించి.. ఎంప్లాయ్‌మెంట్ కార్డు ఆధారంగా ఒకరి పేరుతో మరొకరిని ఉద్యోగంలో చేర్పించారు. దీంతో వారికి ఇంట్లో ఒక పేరు ఉంటే, కంపెనీ రికార్డుల్లో మరో పేరు ఉంటోంది. ఇక ఇప్పుడు మెడికల్ అన్‌ఫిట్ అయి, వారసులకు ఉద్యోగం ఇప్పించాలంటే సమస్య ఎదురవుతోంది. పిల్లల సర్టిఫికెట్లలో తండ్రిపేరు ఒకటి ఉంటే.. సంస్థలో సదరు కార్మికుడు మరో పేరుతో ఉద్యోగం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా.. అటు కార్మిక సంఘాలు, ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు అంటున్నారు. అలియాస్ పేర్లు మారితేనే పిల్లలకు ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియలో కార్మికుల తప్పిదం కూడా ఉన్నప్పటికీ.. వారిని రెండేళ్ల తర్వాత పర్మనెంట్ చేసే సమయంలోనైనా అధికారులు పూర్తి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. కానీ ఆనాటి సింగరేణి రిక్రూట్‌మెంట్‌సెల్, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలు పట్టించుకోలేదని తెలుస్తోంది. 2018లో కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమేశనంలో కార్మికులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా, అలియాస్ పేరు మార్పిడి చేసి వారసత్వ ఉద్యోగాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆరేళ్లు దాటినా సమస్య అలాగే ఉంది. గతేడాది జరిగిన గుర్తింపు ఎన్నికల్లోనూ ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సంఘాలు హామీ ఇచ్చాయి. కానీ ఇప్పుడా సమస్యను పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఈ అంశంపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో చర్చించి లీగల్ ఇబ్బందులు రాకుండా త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.